సాక్షి
పెద్దపల్లి
శనివారం । 20 । మే । 2023



నకిలీ విత్తనాలపై నిరంతర నిఘా

పెద్దపల్లిరూరల్: రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు యత్నించేవారిపై నిరంతర నిఘా ఉంచాలని కలెక్టర్ సంగీత ఆదేశించారు. 8లో ▸



ఎన్టీపీసీ కంట్రోల్ రూమ్ సందర్శన

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్రాజెక్టును న్యూఢిల్లీలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి చెప్యాల అంజిత కుటుంబ సభ్యులతో శుక్రవారం సందర్శించారు.

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గి ఉక్కపోతగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

గోదావరిఖనిటౌన్(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. రామగుండం బల్దియాలో పనిచేసే సిబ్బందికి వివిధ అంశాలపై న్యాయ విజ్ఞానాన్ని అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కంటి వెలుగు శిబిరం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ధూళికట్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. కంటి పరీక్షల తీరు, కళ్లద్దాల పంపిణీ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్యసిబ్బంది అన్ని చర్యలు తీసుకుని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా కృషిచేయాలని సూచించారు. గ్రామస్తులు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 162 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 17మందికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా, సర్పంచ్ గొల్లె కావేరి, శిబిరం మెడికల్ ఆఫీసర్ స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



ముప్పిరితోటలో పనులను పరిశీలిస్తున్న డీపీవో

ఎలిగేడు(పెద్దపల్లి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. మండలంలోని రాములపల్లి, ముప్పిరితోట, లోకపేట గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల తీరును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో ప్లాస్టిక్ వస్తువులు ఉండకుండా ఎప్పటికప్పుడు ఏరివేయాలని పేర్కొన్నారు. నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీల్లో చెత్త చెదారం లేకుండా, రోడ్ల వెంట శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఆయా గ్రామాల్లో పలు ఇళ్లను సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై సలహాలు, సూచనలు చేశారు. కాగా మండలంలోని మిగతా గ్రామాల్లో పారిశుధ్య పనుల తీరును ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పరిశీలించారు. డీపీవో వెంట ఎంపీవో, సర్పంచులు ప్రభావతి, ఐలయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పేదల నిర్మాణాలు కూల్చడం దురదృష్టకరం



మాట్లాడుతున్న చిలుక శంకర్

జ్యోతినగర్(రామగుండం): నిరుపేదల నిర్మాణాలను కూల్చడం దురదృష్టకరమని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూ పీకేరామయ్యకాలనీలో ఏడాది క్రితం పేదలు ఇళ్లు నిర్మించుకోగా, ఇటీవల నిర్మాణాలను కూల్చడంతో శుక్రవారం సందర్శించి మాట్లాడారు. కొంతమంది భూ ఆక్రమణదారులు తమ భూ కబ్జాలకు అడ్డుగా నిర్మిస్తున్నారనే అక్కసుతో పేదల ఇళ్లను తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించిన పాలకులు, కూలీ పనులు చేసుకుని పోగు చేసుకున్న కొద్దిపాటి డబ్బుతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడుతున్న వారి సమాచారం రెవెన్యూ అధికారుల వద్ద ఉన్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటని అన్నారు. అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అసలు పేదవారు ఎవరు, కబ్జాదారులు ఎవరనేది తెలిసిపోతుందన్నారు. పేదల నివాసాలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.



ఈ చిత్రం బసంత్‌నగర్ విమానాశ్రయాన్ని ఆనుకొని ఉన్న కురుమపల్లి గ్రామ శివారులోనిది. ఇక్కడ లభించే ఎర్రమట్టిని రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా జోరుగా తరలిస్తున్నారు. రెండునెలలుగా ఈ దందా సాగుతున్నా అటువైపు చూసేవారు లేరని స్థానికులు వాపోతున్నారు.



ఈచిత్రం రాఘవపూర్, కొత్తపల్లి శివారులోనిది. ఇక్కడ అక్రమంగా చెరువు మట్టిని (నల్లమట్టిని) నిల్వచేసి, అనుమతులు లేకుండా రాత్రి, పగలు ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఆర్డీఏ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. చెరువు మట్టిని ఇటుకబట్టీలకు తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.



ఇది రామగుండం కార్పొరేషన్ మేడిపల్లి చెరువు నుంచి మట్టి తరలిస్తున్న దృశ్యం. వేసవికాలం కావడంతో నిత్యం ఈ చెరువు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అనుమతులు లేకుండా నల్లమట్టిని తరలిస్తున్నారు.

మట్టి దందా

అక్రమంగా నిల్వ చేస్తూ.. తరలిస్తూ..

- రాఘవాపూర్, కొత్తపల్లిలో భారీగా చెరువు మట్టి నిల్వలు
- వే బిల్లులు లేకుండా. ఓవర్‌లోడ్‌తో తరలింపు
- రోడ్లు ధ్వంసమవుతున్నా పట్టించుకునేవారు కరువు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

సాక్షి, పెద్దపల్లి: చెరువులోని పోషకాలతో కూడిన నల్లరేగడి మట్టి సాగుకు యోగ్యంగా ఉంటుంది. అలాగే మన్నికైన ఇటుకు తయారీకి సైతం ఉపయోగపడుతుంది. ఈమట్టిని రైతులు సాగు భూముల్లో పోయించుకుంటే వాటికి బలం చేకూరి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. కానీ రాజకీయ నేతల అండదండలతో అనుమతుల పేరిట ఇటుక బట్టీలకు తరలిపోతుంది. ఓ పక్క చెరువుల నుంచి మట్టి తరలిపోతుండగా, గుట్టలు, కొండలను తొలచి రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. జిల్లాలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. గురువారం జరిగిన జిల్లా పరిషత్తు సమావేశంలో సైతం మట్టిదందా మీద విచారణ చేపట్టాలని నిరసన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా పదుల సంఖ్యలో వాహనాల్లో పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో మట్టిని తరలిస్తున్నా సంబంధింత అధికారులు చోద్యం చూస్తున్నారు.

గుట్టలను తలపించేలా నిల్వలు

జిల్లాలో మట్టి తరలింపు పారదర్శకంగా చేపట్టాలని గతేడాది కలెక్టర్ మట్టి పాలసీని తీసుకొచ్చారు. దీంతో 26 మందికి 11చెరువులకు సంబంధించిన 2,92,858 టన్నుల మట్టిని తరలించేందుకు అనుమతులు ఇచ్చారు. సీనరేజీ, పర్మిట్, డీఎంఎఫ్‌టీ, గ్రామాభివృద్ధి నిధి, పరిపాలనాపరమైన నిర్వహణ వ్యయం తదితర కలిపి టన్నుకు రూ.82.80 ప్రభుత్వానికి చెల్లించాలని నిర్ణయించారు. దీంతో ప్రభుత్వానికి రూ.2.78 కోట్ల ఆదాయం సమకూరింది. పాలసీ విధానం చూడటానికి బాగున్నా అక్కడే మట్టి దందావారు చక్రం తిప్పారు. రాజకీయ నేతల అండదండలతో పరిమితికి మించి రాఘవపూర్, కొత్తపల్లిలో చెరువు మట్టి తవ్వకాలు చేపట్టి, పక్కనే ఉన్న వ్యవసాయ భూముల్లో నిల్వ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులకు మించి తవ్వకాలు చేపట్టి వాటిని గుట్టలుగా రాఘవాపూర్, దేవునిపల్లి దారిలో కెనాల్‌ను అనుకొని పోశారు. ఇప్పుడు ఆ మట్టిని మళ్లీ ఇటుక బట్టీలకు తరలిస్తూ పైసలు దండుకుంటున్నారు. పరిమితికి మించి డంప్ చేశారని గతేడాది ఎన్ని ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చినా పట్టించుకోని అధికారులు.. డంప్ చేసిన మట్టిని ప్రస్తుతం తరలిస్తుంటే వారు గతేడాది అనుమతి తీసుకొని డంప్ చేసుకున్నారని చెబుతుండటం గమనార్హం. నిల్వచేసిన మట్టిని అధికారులు ఇప్పటికైనా సీజ్‌చేసి, విచారణ చేపడితే ప్రభుత్వ ఖజానాకు ఏ మేరకు గండికొట్టారో తేలనుంది.



ఓవర్‌లోడ్ మట్టి లారీలతో రంగాపూర్ గ్రామంలో ధ్వంసమైన బీటీ రోడ్డు



ఈ ఫొటోలో ఉన్నది సుల్తానాబాద్ మండలం కదంబపూర్ శివారులోని ప్రభుత్వ భూమి. ఇక్కడి మట్టిని నిత్యం వందలాది ట్రాక్టర్లలతో రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. ఒక టిప్పర్‌కు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. అధికారులు అక్కడికి వెళ్తే ఓ నాయకుడి పేరు చెబుతున్నట్లు సమాచారం.

పెద్దనోట్ల రద్దు సముచితమే

- రూ.2వేల నోట్ల రద్దుపై జిల్లావాసుల మిశ్రమ స్పందన

సాక్షి, పెద్దపల్లి: నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడానికి, దొంగ నోట్లు ముద్రణను అడ్డుకోవడానికి, ఉగ్రవాదులకు నిధుల సరఫరాను అరికట్టడానికి గతంలో ప్రధాని మోదీ పెద్దనోట్లను రద్దు చేశారు. తాజాగా శుక్రవారం రూ.2వేల నోట్లును మార్కెట్ నుంచి విత్‌డ్రా చేసుకుంటూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై జిల్లావాసులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

చిల్లర సమస్య తీరుతుంది



రూ.2వేల నోట్లను ఆర్బీఐ రద్దు చేయడం మంచి పరిణామమే. 2,000 నోట్లు విరివిగా అందుబాటులో ఉన్న సమయంలో రైతులు వాటిని తమ దుకాణాలకు తీసుకొచ్చేవారు. కానీ ఆ నోట్లు ప్రస్తుతం కనిపించడం లేదు. చిల్లరతో ఇబ్బందులే అవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న రూ.500 నోట్లు ఎక్కువగా వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంటుంది. – జి.వెంకటేశ్, వ్యాపారి, మంథని

ఎప్పుడో రద్దు చేయాల్సింది..



పెద్ద నోట్లతో బ్లాక్‌మనీ పోగు చేస్తున్నారని గతంలో ప్రభుత్వం రద్దు చేసింది. అయితే అంతకుమించిన రూ.2వేల నోటును విడుదల చేయటంతో అక్రమార్కులు మరింత నల్లధనం పోగు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు అయింది. కొద్దిరోజులుగా రెండు వేల నోటు మార్కెట్‌లో కనిపించటం లేదు. ప్రభుత్వం ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయాన్ని ఇప్పటికైనా తీసుకున్నందుకు సంతోషం.
– బుద్దే గోవర్ధన్, వ్యాపారి, గోదావరిఖని

అవగాహన కల్పించాలి



ఆర్థిక వ్యవస్థలో నోట్ల రద్దు అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుండాలి. దీంతో మార్కెట్‌లో నకిలీ నోట్లను అరికట్టవచ్చు. అయితే ఆకస్మిక నిర్ణయాలుగా కాకుండా నిర్దిష్ట ప్రణాళికతో ఈ ప్రక్రియ కొనసాగించాలి. ప్రజలు ఆందోళనలకు గురికాకుండా, వారు నోట్లు మార్పిడి చేసుకునేలా అవగాహన కల్పించడం చాలా అవసరం.
– కావేటి రాజగోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్

విద్యుత్ అంతరాయం.. నిలిచిన డయాలసిస్

- జీజీహెచ్‌లో విద్యుత్ హెచ్చుతగ్గులు
- గత్యంతరం లేక కరీంనగర్‌కు రోగుల తరలింపు



ఖాళీగా ఉన్న బెడ్స్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లోని డయాలసిస్ కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. ఆస్పత్రికి అనుసంధానమైన విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడడంతో డయాలసిస్ కేంద్రంలోని యంత్రాలు పని చేయని పరిస్థితి నెలకొంది. సుమారు 16 మంది డయాలసిస్ పేషెంట్లు ఉండగా వారికి సేవలు అందించలేకపోయారు. ఇందులో నలుగురు బాధితులకు అత్యవసరంగా డయాలసిస్ చేయాల్సి ఉండడంతో వారిని కరీంనగర్‌లోని డయాలసిస్ కేంద్రానికి తరలించారు. ఇటీవల విద్యుత్ హెచ్చుతగ్గుల మూలంగా డయాలసిస్ సెంటర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అదనంగా ఉన్న మరో యంత్రంలోని విడిభాగాలను ఉపయోగించి వినియోగంలోకి తీసుకువచ్చారు. గతేడాది కూడా విద్యుత్ సమస్యతో కేంద్రంలోని యంత్రాలు కాలిపోయిన పరిస్థితులు తలెత్తాయి. 330 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చెందినా ఆ స్థాయిలో అవసరానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయలేని దుస్థితిలో ఉండడం స్థానికంగా విమర్శలకు తావిస్తోంది. విద్యుత్ హెచ్చు తగ్గులకు సంబంధించి ఉదయం టెక్నీషియన్లు మరమ్మతు చేపట్టినా ఫలితం కానరాలేదు. సమస్య ఇలాగే ఉంటే శనివారం కూడా కేంద్రంలో సేవలు అందించలేని పరిస్థితి నెలకొననుంది. అయితే ఆస్పత్రికి విద్యుత్ సామర్థ్యాన్ని పెంచే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనులు వేగవంతంగా ముందుకు సాగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం తగులబెట్టి రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

మంథని: 'వడ్లు మార్కెట్ల పోసి నెల దాటింది. చెడగొట్టు వాన మూడుసార్లు ముంచింది. తూకం వేయమంటే 2 కిలోల తరుగు అన్నరు. అయినా పర్వాలేదంటిమి. కానీ పట్టించుకోకపోతిరి. గిట్ల ఉసురు పోసుకుంటే ఎట్ల బతుకుమంటరు' అంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. తూకంలో జాప్యం చేస్తూ, తరుగు పేరిట ఇబ్బందులకు గురిచేస్తూ ధాన్యం కొనడం చేయడం లేదని శుక్రవారం మంథన– పెద్దపల్లి ప్రధాన రహదారిపై స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట రైతులు రాస్తారోకో చేశారు. వరిధాన్యంకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. మిల్లర్లు ధాన్యం దించుకోవడం లేదని 41కి బదులు 42 కి లోలు తూకం వేస్తామంటే ఒప్పుకున్నామని, అ యినా కాంటా పెట్టినంక 39 కిలోలే వస్తున్నాయని చెబుతున్నారని వాపోయారు. తూకం వేసిన ధా న్యం మిల్లులకు చేర్చడం లేదని, ఒక్క మంథని మార్కెట్‌లో 5 వేల బస్తాలు ఉన్నాయన్నారు. రై తుల ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించింది. మంథని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు రైతులకు నచ్చజెప్పినా వినలే దు. తహసీల్దార్ ప్రకాశ్ రైతులతో మాట్లాడి వారి సమస్యలను సివిల్ సప్లై అధికారులకు వివరించా రు. సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని చె ప్పడంతో రైతులు శాంతించారు. రైతుల ధర్నాలో కాంగ్రెస్ నాయకులు మద్దతుగా పాల్గొన్నారు.

టీచర్ శిక్షణ.. నిధుల భక్షణ!

- సంగీతం, టైలరింగ్, చిత్రలేఖనంలో తర్ఫీదు
- ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌తో పెరిగిన డిమాండ్
- కోర్సుకు అవసరానికి మించి సిబ్బందిని నియమించారని ఆరోపణలు
- ఏటా ఒకే బృందంతో ట్రైనింగ్ ఇస్తున్నారని ఫిర్యాదులు



శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీసీ) ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనుకునే వారికి పునాదిలాంటిది. హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్(హన్మకొండ) ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న కోర్సు ఇది. ఇటీవల ప్రారంభమైన టీటీసీసీ–2023 బ్యాచ్‌లో వందలాదిమంది అభ్యర్థులు చేరారు. సంప్రదాయ ఉపాధ్యాయ శిక్షణతోపాటు సంగీతం, టైలరింగ్, చిత్రలేఖనం వంటి కోర్సుల్లోనూ ఇక్కడ నైపుణ్యాలు నేర్పిస్తారు. కరీంనగర్‌లోని శిక్షణ కేంద్రంలో 500 మందికి పైగా అభ్యర్థులు శిక్షణ పొందుతుండగా.. అవసరానికి మించిన ఉపాధ్యాయులు, సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు తనకు దగ్గరున్న వారికే శిక్షణ విధులు కేటాయించేలా చక్రం తిప్పాడని, దీని వెనుక లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కుంభకోణం దాగి ఉందని ఆరోపిస్తున్నారు.

ఎక్కడ నేర్పిస్తున్నారు?

ఈ కోర్సులో టీచింగ్ కెరీయర్‌గా ఎంచుకునే వారందరికీ ఉపయుక్తంగా ఉంటుంది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ (టీటీసీసీ) ఆధ్వర్యంలో ఈ టీటీసీసీ–2023 (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు)కు 42 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. మే ఒకటో తేదీ నుంచి జూన్ 11వరకు కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దంన్‌గర్‌వాడీ పాఠశాల వేదికగా మంకమ్మతోటలో నిర్వహిస్తున్నారు. కుట్లు, చిత్రలేఖనం, సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్‌లో 246 మంది, డ్రాయింగ్ 293 మంది, మ్యూజిక్ 14 మంది మొత్తం 553 మంది శిక్షణ పొందుతున్నారు. పదో తరగతి లేదా లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత ఉండి 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి ఉన్న వారు కోర్సులో చేరొచ్చు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలతోపాటు ఆసిఫాబాద్, గజ్వేల్, చెన్నూరు, గోదావరిఖని, మంథని, ఆదిలాబాద్, సిద్దిపేట, మంచిర్యాల, జగిత్యాల, జన్నారం నుంచి అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారు. 2016, 2017, 2018 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సిబ్బంది ఎక్కువయ్యారని ఆరోపణలు

ఈ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు అవసరానికి మించి ప్రభుత్వ టీచర్లకు విధులు కేటాయించారని, ఇందులో ఈఎల్స్ ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునే కుట్ర ఉందని పలువురు సీనియర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. తొలుత కోర్సు బోధనకు 22 మందిని తీసుకున్నారు. బోధన సిబ్బందికి పీజీ, ఎంఈడీ అర్హత తప్పనిసరి. ఈ అర్హతలు లేకున్నా.. కొందరిని ఎంపిక చేయడం వివాదాస్పదంగా మారింది. వెంటనే నాలిక కరుచుకున్న అధికారులు తొమ్మిదిమందిని తప్పించారు. ప్రస్తుతం డైట్ కాలేజీలో పనిచేసిన 13 మంది ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణకు మరో ఐదుగురు, డ్రాయింగ్ కోసం ఆరుగురు, టైలరింగ్ కోసం ఒకరు, మ్యూజిక్ టీచర్, బిల్డింగ్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ వర్క్ కోసం ఎనిమిదిమంది, ఐదుగురు పీఈటీలు, ఆరుగురు అటెండర్లు ఉన్నారు. వీరితోపాటు ఒక కోర్సు డైరెక్టర్ కోర్సు కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎవరా నేత?

గతంలో కోర్సు నిర్వహణకు ఇంతమంది సిబ్బంది లేరని, ఇప్పుడు అవసరానికి మించి కేటాయించడం వెనక ఉద్దేశం ఏంటని తోటి ప్రభుత్వ ఉపాధ్యాయులే నిలదీస్తున్నారు. ప్రతీసారి ఈ సిబ్బంది ఎంపికలో ఓ ఉపాధ్యాయ సంఘం నేత చక్రం తిప్పుతున్నాడని, ఆయన ఏటా తన మనుషులుగా ముద్రపడ్డ వారికే డ్యూటీలు వేయిస్తున్నారని మండిపడుతున్నారు. పీఈటీలు, ఆఫీస్ సబార్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు అవసరానికి మించి ఉన్నారని, దీని వెనక లీవు ఎన్ క్యాష్‌మెంట్ కుంభకోణం దాగి ఉందని ఆరోపిస్తున్నారు. అడ్మిషన్లు, బిల్డింగ్ ఇన్‌చార్జులుగా ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తుండటమే ఇందుకు నిదర్శమని ఆరోపిస్తున్నారు. డీఈవో, డైట్, డీసీఈబీలలో నాన్ టీచింగ్‌స్టాఫ్‌ని సద్వినియోగం చేసుకోకుండా ఉపాధ్యాయులను ఆ పోస్టులో ఎలా నియమిస్తారని, అభ్యర్థుల సంఖ్య పెరగనప్పుడు అదనపు సిబ్బంది దేనికోసమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కోర్సు కో ఆర్డినేటర్ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా.. అభ్యర్థుల నిష్పత్తిగా తగినట్టుగానే సిబ్బంది కేటాయింపు జరిగిందని, అదనంగా ఎవరూ లేరని సమాధానం ఇచ్చారు.

క్లుప్తంగా

ఇద్దరికి గాయాలు?

ఫెర్టిలైజర్ సిటీ : రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో యంత్రం మరమ్మతులు చేస్తుండగా ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని గోదావరిఖని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై శుక్రవారం ఆర్ఎఫ్‌సీఎల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి


రాజ్‌కుమార్ మృతదేహం

గోదావరిఖని : రాజీవ్‌నగర్‌కు చెందిన గోలి రాజ్‌కుమార్ (40) అనే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజ్‌కుమార్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు.

బావిలో పడి మరొకరు..

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపరపల్లె గ్రామానికి చెందిన యాసం రాజయ్య (50) ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందినట్లు ఏఎస్సై లక్ష్మీ రాజం తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. కొలనూర్ గ్రామంలో గురువారం ఓ వ్యక్తి మృతిచెందగా రాజయ్య అక్కడికి వచ్చాడు. అంత్యక్రియలు ముగిశాక అతడు స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. శుక్రవారం మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

లారీల పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండలంలోని నీరుకుల్ల గ్రామంలో శుక్రవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. మానేరు వాగు అవతల గల ఊటూర్ గ్రామం నుంచి వే బిల్లులు లేకుండా అక్రమంగా సుల్తానాబాద్ మండలంలోని ఓ ఇటుక బట్టీకి మట్టి తరలిస్తున్న మూడు లారీలను పట్టుకున్నారు. అనుమతి పత్రాలు చూపించకుంటే తదుపరి చర్యల కోసం మైనింగ్ శాఖకు నివేదించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

150 మెడికల్ సీట్ల భర్తీకి ఎన్ఎంసీ అనుమతి

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రెండో బ్యాచ్‌లో 150 సీట్ల భర్తీకి జాతీయ వైద్యమండలి(ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చినట్లు ఆర్ఎంఓ డాక్టర్ ఆర్.అరుణ తెలిపారు. ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషకరమన్నారు. కాగా వచ్చే ఆగస్టు నుంచి రెండో బ్యాచ్ ఎంబీబీఎస్ సీట్ల భర్తీ కానుందని తెలుస్తోంది.

నేత్రాలు దానం

యైటింక్లయిన్ కాలనీ : స్వచ్ఛంద సేవా సంస్థ సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి బంధువు వరంగల్‌లోని ఉంటున్న రిటైర్డ్ టీచర్ బావిరిశెట్టి లింగమూర్తి (75) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులు మృతుడి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ నరేందర్‌తో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. మృతుడి నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, నర్సయ్య. మనోహర్, చంద్రమౌళి, బిష్మాచారి తదితరులు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు ఊరట

- రూ.వెయ్యి వేతనం పెంచుతూ ఇటీవల ప్రభుత్వ జీవో జారీ
- జిల్లాలో 2,054 మంది కార్మికులు

జిల్లాలో..	
మున్సిపల్ కార్మికులు	458
పంచాయతీ కార్మికులు	1,596


సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

మంథని/సుల్తానాబాద్: మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇటీవల మే డే సందర్భంగా ప్రతి కార్మికుడికి రూ.1,000 చొప్పున వేతనం పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పట్టణాలు, పంచాయతీల్లో విధులు నిర్వహించే వందలాది మందికి లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం ఒక్కో కార్మికుడికి రూ.15,500 వేతనం చెల్లిస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ పోను చేతికి రూ.13,683 వస్తోంది. తాజా నిర్ణయంతో వేతనం 16,500, చేతికి రూ.14,683 రానుంది.

కనీస వేతనాల కోసం పోరాటాలు

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ తదితర సంఘాల ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.21,000 వేతనం అమలు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందజేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెంచిన వేతనాల మాదిరిగా తెలంగాణలో వేతనాలు పెంచాలని కోరుతున్నారు.

పర్మినెంట్ చేయాలి



పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చెయ్యాలి. వేతనాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలి.

– పాక మహేశ్, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

30 శాతం పెంచాలి



పారిశుధ్య కార్మికులకు 30 శాతం వేతనాలు పెంచాల్సి ఉండే. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశాం. ప్రభుత్వం గుర్తించినప్పటికీ మరింత జీతాలు పెంచితే బాగుండేది. కార్మికులు ఒక్కొక్కరికి రూ.1,000 పెంపు నిర్ణయం హర్షణీయం. దీంతో జిల్లాలో వందలాది మందికి కొంత ఊరట కలగనుంది.– లచ్చయ్య, మల్టీపర్పస్ వర్కర్, కాట్నపల్లి

నకిలీ విత్తన విక్రయాలపై నిరంతర నిఘా

- కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు యత్నించేవారిపై నిరంతర నిఘా ఉంచాలని కలెక్టర్ సంగీత ఆదేశించారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనాథ్ (72888 94148), సీడ్ సర్టిఫికేషన్ అధికారి కుమార్ (72888 79672), ఏఎస్ఐ రవీందర్ (92900 68636) టాస్క్‌ఫోర్స్ బృందంలో సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వ్యాపారులపై కేసులు నమోదు చేయాలన్నారు.

ఓటరుజాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలి

ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా రాజకీయ పార్టీల నాయకులు గుర్తిస్తే వెంటనే తెలియజేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లాలోని 834 పోలింగ్ కేంద్రాల పరిధిలో 6,66,503 మంది ఓటర్లున్నారని అందులో చనిపోయిన, వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జాబితాల నుంచి మరణించిన, వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీ 25,923 మంది పేర్లను తొలగించామని వివరించారు. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ నర్సింహమూర్తి, ఆర్డీఓ వెంకటమాధవరావు, డీటీ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

యువ ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాస్థాయి యువ ఉత్సవాలను జూన్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల యువత కరీంనగర్‌లోని నెహ్రూ యువకేంద్రంలో 91773 29258, 0878–2243604 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

పనులు పూర్తిచేయాలి

జిల్లాలో మన ఊరు– మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు జూన్ 10 నాటికి పూర్తి కావాలని కలెక్టర్ సంగీత, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 42 పాఠశాలల్లోనే పనులు మందకొడిగా సాగుతున్నాయని వాటిల్లో వేగం పెంచాలన్నారు. డీఈఓ మాధవి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎంకప్ జిల్లా స్థాయి క్రీడాపోటీలు ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మంచి ఫలితాలు సాధించాలి

పెద్దపల్లిరూరల్: కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులు 90శాతం పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కేజీబీవీ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్స్‌తో సమీక్షించారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. 60శాతం కంటే తక్కువ మార్కులు వస్తే వారితో ఇంప్రూవ్‌మెంట్ రాయించాలన్నారు. డీఈఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి


అమిత్ మృతదేహం

రామగుండం: రైలులోనే ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన శుక్రవారం రామగుండం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రంలోని లాల్‌పూర్ ప్రాంతానికి చెందిన అమిత్ ఇద్దరు బంధువులతో కలిసి ఏప్రిల్ 27న చెన్నైలోని ఎగ్మోర్‌కు కార్పెంటర్ పని చేసేందుకు వెళ్లాడు. పని ముగించుకొని రాజస్థాన్‌కు వెళ్లేందుకు వారు చెన్నై నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వెళ్లే దురంతో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్–3 కోచ్‌లో ప్రయాణిస్తున్నారు. రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే అమిత్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించిన బంధువులు రైల్వే అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు దురంతోకు రామగుండం స్టేషన్‌లో హాల్టింగ్ లేకున్నా నిలిపివేశారు. కాగా వైద్యుడు అమిత్‌ను పరీక్షించగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కాగా అమిత్‌కు మూడు రోజులుగా జ్వరం వస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లిఖిత, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి బంధువు అవతార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ తిరుపతి పేర్కొన్నారు.

గొర్రెల పెంపకందారుల రుణాలు మాఫీ చేయాలి

పెద్దపల్లిరూరల్: గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం అందించిన రుణాలను మాఫీ చేయాలని గొర్రె కాపరుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలో మాట్లాడారు. ప్రభుత్వం రెండో విడతగా పంపిణీ చేసే గొర్రెలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించినా జిల్లాలోని మార్కెట్లలో పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టపోయిన పెంపకందారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం రుణాలను మాఫీ చేయాలన్నారు. నాయకులు చిలారపు పర్వతాలు, మేకల నర్సయ్య, బత్తిని లక్ష్మణ్, దాడి రవి తదితరులున్నారు.

ఎన్టీపీసీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే నెరవేర్చాలని ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్స్ యునైటెడ్ ఫోరం(జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాజెక్టు లేబర్ గేట్ నుంచి మేడిపల్లి సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొత్త వేతన ఒప్పందం అమలుకు కార్మిక సంఘాలతో యాజమాన్యం వెంటనే చర్చలు కొనసాగించాలని కోరారు. సమ్మె నోటీసు అందించినా చర్చలు కొనసాగించకపోవడం ఏంటని ప్రశ్నించారు. పాత వేతన ఒప్పందంలోని అంశాలను పరిష్కరించడంతో పాటు కొత్త వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, ఎం.శంకర్, ఉపేందర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, రాధారపు రాజమల్లయ్య, చింతల సత్యం, శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

మానేరులో ఇసుక తవ్వకాలకు ఓకే

- ప్రజావసర పనుల కోసమే జరపాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా మానేరు నదిలో ఇసుక తవ్వకాలకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అయితే ప్రజావసర పనుల కోసం మాత్రమే ఇక్కడి ఇసుకను వినియోగించాలని నిబంధన విధించింది. ఇతర పనుల కోసం వాడుకోరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ తదుపరి విచారణను జూలైకి వాయిదా వేసింది. మానేరులో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, దీనిని ఆపాలంటూ సిద్దిపేటకు చెందిన రఘువీర్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లాకు చెందిన కరుణాకర్ రెడ్డి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ఎన్‌జీటీ.. మానేరు నదిలో ఇసుక తవ్వకాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీఎస్ఎండీసీ) వైస్ చైర్మన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎన్‌జీటీ తమ వాదనలు వినకుండా ఉత్తర్వులు ఇచ్చిందని పిటిషనర్ తరఫున న్యాయవాది నివేదించారు. మానేరులో పలుచోట్ల చెక్‌డ్యాంల నిర్మాణం సాగుతోందని, ఇసుక తవ్వకాలు నిలిచిపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రభుత్వ పథకాల అవసరాలకు ఇసుక తవ్వకాలు జరుపుకునేందుకు అనుమతి ఇచ్చారు.

అవినీతి, అక్రమాలతో పాలన


సమావేశంలో మాట్లాడుతున్న విజయ రమణారావు

- పీసీసీ ఉపాధ్యక్షుడు విజయ రమణారావు

సుల్తానాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య, మధ్య తరగతి ప్రజలను నట్టేట ముంచేలా వ్యవహరిస్తున్నాయని పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయ రమణారావు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలతో పాలన సాగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కర్ణాటక ఫలితాలు తెలంగాణలో రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ నుంచి పొగ వస్తుందని స్థానికులు నాయకులకు విన్నవించారు. అనంతరం వార్డు కమిటీని ఎన్నికలు నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు అబ్బయ్య గౌడ్, అధ్యక్షుడు చిలుక సతీశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సాహిరి మహేందర్ మాజీ సర్పంచ్ అన్నయ్య గౌడ్, ప్రకాశ్ రావు, కౌన్సిలర్లు రాజయ్య, రఫిక్, రాజు, కాంగ్రెస్ నాయకులు కుమార్, కిషోర్, చిలుక రాజేశం, తదితరులున్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత


నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని : సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1లో శుక్రవారం జీఎం చింతల శ్రీనివాస్ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా దిగిపోయిన నలుగురు కార్మికుల పిల్లలకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు ఏరియాలో 1343 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ నాయకులు శ్రావణ్‌కుమార్, ఎస్ఓటు జీఎం రాం మోహన్, పర్సనల్ డీజీఎం లక్ష్మీ నారాయణ, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గోదావరిఖని : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకుంటే పకృతి మనల్ని రక్షిస్తుందన్నారు. సింగరేణి సంస్థ మొక్కలను నాటడంతో పాటు పెంచే బాధ్యత చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్ రావు, సీఎంఓఏఐ నాయకులు శ్రావణ్‌కుమార్, ఎస్ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

యోగా కేంద్రం ప్రారంభం

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా కేంద్రాన్ని ఆర్జీ–3 ఎస్వోటూ జీఎం రఘుపతి శుక్రవారం ప్రారంభించారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు, సీవీ.మారుతిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం గదిని పునరుద్ధరించాలి


ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిని వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. అంతకుముందు పోస్టుమార్టం గదిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి మండలాలకు ముఖ్య కూడలైన సుల్తానాబాద్ ఆస్పత్రిలో పోస్టుమార్టం గది ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో కూలిపోయే దశలో ఉందని, గదిని వాడొద్దని నిర్ణయించుకొని పెద్దపల్లికి బదిలీ చేశారని ఆరోపించారు . ఇంజినీరింగ్ అధికారుల నివేదిక తీసుకునేందుకు రెండేళ్ల గడువు పడుతుందా అని ప్రశ్నించారు. సుల్తానాబాద్ నుంచి తరలిన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఐసీడీఎస్, పీఆర్‌డీఈతో పాటు పోస్టుమార్టం గది వచ్చేవరకు ఆందోళన ఆపేది లేదన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, యథావిధిగా అన్నీ తీసుకొస్తామని పేర్కొన్నారు. అనంతరం డీసీహెచ్ డాక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జెడ్పీ సమావేశంలో సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీరావు సమావేశం దృష్టికి తీసుకురావడంతో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించారని, త్వరలో పరిష్కారం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

- LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3219]

WANTED

- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1190695]
- ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786333]
- హైదరాబాద్ లో పెట్రోల్ బంకులో పనిచేయుటకు Exp/ సేల్స్ మ్యాన్, హెల్పర్ కావలెను. మంచి జీతం: R.P. రోడ్, Sec-bad & బోయిన్‌పల్లిలో కావలెను. ఫోన్ : 6301138273, 8008082516 [H-778993]
- HYD లోని ఇంటర్ నెట్ సంస్థలో Cable work చేయుటకు వర్కర్స్ కావలెను. జీ॥ 9000/-& ఫ్రీ భోజనం + ఉచిత వసతి సౌకర్యం. No Qualification సంప్ర॥ సెల్: 9030555366. [W-785568]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


రిటైర్డ్ టెక్నీషియన్లతో జూనియర్లు

- నలభై ఏళ్ల తర్వాత రిటైర్డ్ టెక్నీషియన్ల ఆత్మీయ సమ్మేళనం
- రోజంతా ఆనందంగా గడిపిన సీనియర్లు

గోదావరిఖని : నాలుగు దశాబ్దాల పాటు సింగరేణి కోసం శ్రమించిన రిటైర్డ్ టెక్నీషియన్ల ఆత్మీయ సమ్మేళనం అలరించింది. శుక్రవారం యైటింక్లయిన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పాత జీడీకే–9వ గని టెక్నీయన్లు అంతా ఒక్కచోట చేరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన సీనియర్లను జూనియర్లు ఆత్మీయంగా అలింగనం చేసుకుని స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, రిటైర్డ్ డీవైడీజీఎంఎస్ సత్యనారాయణ యాదవ్, నిర్వాహకులు దశరథం గౌడ్, కొత్త సత్యనారాయణ రెడ్డి, చెర్కు ప్రభాకర్ రెడ్డి, సాంబశివరావు, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల తర్వాత కలిశాం



అందరం ఒకేచోట కలవడం మర్చిపోలేని అనుభూతి. ఇక్కడ నుంచి వెళ్లి హైదరాబాద్‌లో ఉంటున్నా. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ అంతా కలిశాం. ఆత్మీయ సమ్మేళనంలో అందరం కలిసే అవకాశం లభించింది.

– బి.రాంచందర్, రిటైర్డ్ మెకానికల్ చార్జెంట్

ఆనందంగా ఉంది



నలభై ఏళ్ల పాటు అంతా కలిసి పనిచేశాం. రిటైర్డ్ అయిత తర్వాత వెళ్లిపోయాం. మళ్లీ కలుస్తామనుకోలేదు. ప్రస్తుత టెక్నీషియన్లు నిర్వహించిన సమ్మేళనం ద్వారా కలవడం ఆనందంగా ఉంది.

– ఎంఏ జమీల్, రిటైర్డ్ ఫిట్టర్

జ్ఞాపకాలు నెమరేసుకున్నాం..



నలభై ఏళ్ల పాటు కలిసి పనిచేశాం. రిటైర్డ్ అయిన తర్వాత తలో దారిన వెళ్లిపోయాం. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ కలుస్తాం. అనుకోలేదు. అప్పటి తీపి జ్ఞాపకాలు నెమరేసుకున్నాం.

– ఎస్. దామోదర్ రెడ్డి, రిటైర్డ్ ఎలక్ట్రీషియన్

ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని ఆర్టీసీ డిపో ఆవరణలోని డిపో పరిరక్షణ చౌరస్తా, బీపవర్‌హౌస్ బస్ స్టాఫ్ పాయింట్‌లను ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం భీమ్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం ఏప్రిల్ నెల ఈపీకే, కేఎంపీఎల్ సాధించిన 12మంది ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు ఇచ్చి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు సమష్టిగా విధులు నిర్వర్తించి డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీఎం ఎం.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

జ్యోతినగర్: పోగొట్టుకున్న ఫోన్‌ను ఎన్టీపీసీ పోలీసులు బాధితుడికి అందజేశారు. శుక్రవారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ అభిలాష లాడ్జిలో పనిచేసే కుమ్మరి సాయి ప్రసాద్ మొబైల్‌ను గత నెల 29న పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. పోలీసులు ఫోన్‌ను గుర్తించి బాధితుడికి ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.